సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 10 | అక్టోబర్ | 2023



సరిహద్దుల్లో పోలీస్‌బాస్
తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కాళేశ్వరంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పర్యటించారు.
- 8లో▸



విద్యార్థి జేఏసీ దీక్షల విరమణ
కేయూలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం విరమించారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం $34^{0}/23^{0}$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. సాయంత్రం చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



కాజీపేట అర్బన్: పేదల పక్షపాతి సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం 250 మందికి బీసీ బంధు, 80 మందికి మైనార్టీ బంధు చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు శ్రీనివాస్, సంకు నర్సింగ్, బీసీ, మైనార్టీ ఈడీలు రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో ఐదుగురు డీబార్
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇయర్‌వైజ్ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ.. ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని డీబార్ చేసినట్లు కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా
- నేటి నుంచి విధుల్లోకి..



విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం హనుమకొండలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈనెల 10 నుంచి విధుల్లోకి వెళ్లాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం లలిత ఆదేశించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ధర్నాలో బాధ్యులు లక్ష్మి, రమ, స్వరూప, కవిత, ఇందిర, ఐలయ్య, రాధమ్మ, శారద, విమల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పోటీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ
కాజీపేట అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోపు నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం..

న్యూశాయంపేట: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టీఆర్టీకి దరఖాస్తు చేసుకున్న వంద మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు అందించే ఈశిక్షణకు ఈనెల 13 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 73309 90322 నంబర్‌లో, లేదా సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల ఏఆర్ బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా సరళాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆకళాశాల వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

గ్రేటర్ గ్రీవెన్స్ రద్దుతో ఇక్కట్లు
వరంగల్ అర్బన్: ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేశారు. ముందుగా గ్రీవెన్స్ ఉంటుందని అధికారులు ప్రకటించడంతో ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తీరా గ్రీవెన్స్ లేకపోవడంతో ఇన్‌వార్డ్‌లో వినతిపత్రాలు ఇచ్చి వెళ్లారు.



మోగిన నగారా

ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 3న నోటిఫికేషన్.. 10 వరకు నామినేషన్లు
- పోలింగ్ 30న.. డిసెంబర్ 3న లెక్కింపు, ఫలితాలు
- ఉమ్మడి జిల్లాలో 3,286 కేంద్రాలు, 28.93 లక్షల ఓటర్లు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- అధికారుల అప్రమత్తం.. చెక్‌పోస్టుల ఏర్పాట్లు.. ముమ్మరంగా తనిఖీలు

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఇలా....

	2018	2023
షెడ్యూల్ విడుదల	అక్టోబర్ 6	అక్టోబర్ 09
నోటిఫికేషన్ జారీ	నవంబర్ 12	నవంబర్ 3
నామినేషన్ల స్వీకరణ	నవంబర్ 19 వరకు	నవంబర్ 10 వరకు
పరిశీలన	నవంబర్ 20న	నవంబర్ 13న
ఉపసంహరణ	నవంబర్ 22	నవంబర్ 15
పోలింగ్	డిసెంబర్ 7	నవంబర్ 30
ఓట్ల లెక్కింపు, ఫలితాలు	డిసెంబర్ 11	డిసెంబర్ 3

ఉమ్మడి వరంగల్‌లో ఎన్నికలు జరగనున్న స్థానాలు

మొత్తం అసెంబ్లీ స్థానాలు : 12

01. వరంగల్ తూర్పు	07. జనగామ
02. వరంగల్ పశ్చిమ	08. పాలకుర్తి
03. వర్ధన్నపేట (ఎస్సీ)	09. మహబూబాబాద్ (ఎస్టీ)
04. పరకాల	10. డోర్నకల్ (ఎస్టీ)
05. నర్సంపేట	11. ములుగు (ఎస్టీ)
06. స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ)	12. భూపాలపల్లి

సాక్షిప్రతినిధి, వరంగల్: శాసనసభ ఎన్నికల నగారా సోమవారం మోగింది. ఉమ్మడి వరంగల్‌లోని 12 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. కేంద్ర ఎన్నికల కమిషన్ .. షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం ఆరు నెలల నుంచే అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈనెల 5న నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను కూడా ప్రచురించారు. కలెక్టర్లు జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తుండగా.. బూత్‌లెవెల్లో కూడా అధికారులను నియమించి శిక్షణ ఇచ్చారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటన ప్రకారం.. వచ్చే నెల 3న నోటిఫికేషన్ వెలువడనుండగా.. అదే రోజు నుంచి ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో నామినేషన్లు 10వ తేదీ వరకు స్వీకరిస్తారు.

28.93 లక్షల మంది ఓటర్లు..
3,286 పోలింగ్ కేంద్రాలు..

హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 28,92,786 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా 14,60,915 మంది మహిళా ఓటర్లు కాగా, 13,31,395 మంది పురుషులు, 476 ఇతరులు. స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ), వర్ధన్నపేట (ఎస్సీ) నియోజకవర్గాల్లో 5,03,536 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 568 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహబూబాబాద్(ఎస్టీ), డోర్నకల్(ఎస్టీ), ములుగు (ఎస్టీ) నియోజకవర్గాల్లోని 6,80,805 మంది ఓటర్ల కోసం 834 కేంద్రాలను కేటాయించారు. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, పాలకుర్తి, జనగామ, భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గాల్లోని 17,08,445 మంది ఓటర్ల కోసం 1,884 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. కాగా.. ఉమ్మడి వరంగల్‌లోని 3,286 కేంద్రాలకు గాను 812 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించిన అధికారులు జియోట్యాగింగ్‌తో పాటు వెబ్‌క్యాస్టింగ్ విధానాన్ని ఏర్పాటు చేశారు. ముందస్తుగానే ఆరు జిల్లాల పరిధిలో సజావుగా ఎన్నికల్ని నిర్వహించే ఏర్పాట్లను దాదాపుగా పూర్తిచేశారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది తమ బాధ్యతల్ని పక్కాగా నిర్వర్తిస్తున్నారు. ఇందులో భాగంగా పలు బృందాల ఏర్పాట్లు సహా అధికారులకు సిబ్బందికి అవసరమైన శిక్షణల్ని పలు దఫాలుగా పూర్తి చేశారు.

ఉమ్మడి వరంగల్‌లో నియోకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు (05.10.2023 వరకు)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
వరంగల్ పశ్చిమ	1,37,139	1,39,976	10	2,77,125	244
పరకాల	1,06,451	1,10,601	02	2,17,054	239
వరంగల్ తూర్పు	1,20,323	1,25,621	338	2,46,282	230
నర్సంపేట	1,11,870	1,14,742	05	2,26,617	283
వర్ధన్నపేట	1,28,722	1,31,818	15	2,60,555	278
జనగామ	1,14,626	1,14,973	10	2,29,609	277
పాలకుర్తి	1,22,040	1,21,682	08	2,43,730	294
స్టేషన్‌ఘన్‌పూర్	1,20,848	1,22,132	01	2,42,981	290
మహబూబాబాద్	1,21,441	1,24,289	35	2,45,765	275
డోర్నకల్	1,05,886	1,08,242	26	2,14,154	256
భూపాలపల్లి	1,33,461	1,34,562	05	2,68,028	317
ములుగు	1,08,588	1,12,277	21	2,20,886	303

వ్యూహంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు..

2018 డిసెంబర్ 7న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాలకుగాను 10చోట్ల బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అభ్యర్థులు గెలిచారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి), దాస్యం వినయ్ భాస్కర్ (వరంగల్ పశ్చిమ), నన్నపునేని నరేందర్ (వరంగల్ తూర్పు), అరూరి రమేశ్ (వర్ధన్నపేట), చల్లా ధర్మారెడ్డి (పరకాల), శంకర్‌నాయక్ (మహబూబాబాద్), డీఎస్ రెడ్యానాయక్ (డోర్నకల్), ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి(జనగామ), పెద్ది సుదర్శన్‌రెడ్డి(నర్సంపేట), డాక్టర్ టి.రాజయ్య(స్టేషన్‌ఘన్‌పూర్) గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి), ధనసరి సీతక్క (ములుగు) విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా ఈసారి ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించిన గులాబీ దళపతి కేసీఆర్ తొమ్మిది మంది సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. ములుగుకు జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతికి కొత్తగా అవకాశం కల్పించగా.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్య స్థానంలో కడియం శ్రీహరికి చాన్స్ ఇచ్చారు. జనగామ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మార్చి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇస్తారంటుండగా.. ఇంకా స్పష్టత లేదు. ఇదిలా ఉండగా.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. దరఖాస్తులు చేసుకుని కూడా నెల రోజులు దాటింది. తాజాగా సోమవారం ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో గెలవడం కోసం అధికారపార్టీ నేతలు దూకుడు పెంచగా, ప్రతిపక్ష పార్టీల ఆశావహ నేతలు వ్యూహరచనలో పడ్డారు. ఎలాగైనా పీఠాన్ని దక్కించుకునేలా ఆ పార్టీల నాయకులు ముందుకు సాగుతున్నారు.

సోమవారం నుంచే ఎన్నికల కోడ్..
అధికారుల అప్రమత్తం, తనిఖీలు

కోడ్ అమల్లోకి రావడంతో అధికార పార్టీ నేతలు పార్టీ పనులకు పాలనా యంత్రాంగాన్ని వినియోగించుకోకూడదు. అధికార పర్యటనలు, పార్టీ ప్రచార పర్యటనలు రెండూ కలిపి ఉండకూడదు. ఇంటి నుంచి కార్యాలయానికి, కార్యాలయం నుంచి ఇంటికి తప్ప మరే ఇతర పనులకు ప్రభుత్వ వాహనాలను ఉపయోగించకూడదు. అలాగే ఎన్నికల నియమావళికి విఘాతం కలిగే పనులు ఏ పార్టీ నాయకులైనా పాల్పడకూడదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు.

'నాయిని' బీఆర్ఎస్ కోవర్టు
- డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట అర్బన్: 'నాయిని రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్ కోవర్టు, రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించాడు' అని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని పశ్చిమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. రెండ్రోజుల క్రితం 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలో ప్రచారానికి వెళ్లగా.. నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు అంబేడ్కర్‌రాజు తమను అడ్డుకుని దాడికి దిగినట్లు తెలిపారు. అడ్డుకోబోయిన తమ కార్యకర్తల్ని రాడ్లు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు తెలిపారు. దాడి విషయంపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, నాయిని వర్గీయులు కూడా ఫిర్యాదు చేశారని తెలిపారు. తనకు కేసులు కొత్త కాదని, మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ వినయ్ సహకారంతో నాయిని రాజేందర్‌రెడ్డి.. తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలీ తదితరులున్నారు.

కొరుకుతున్నాయ్.. గీరుతున్నాయ్!
- విపరీతమైన కోతుల బెడద
- బయటికెళ్లాలంటే భయం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లిలో కోతుల బెడద విపరీతమైంది. గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ.. చాలా మందిని గాయపరుస్తున్నాయి. గ్రామానికి చెందిన వృద్ధుడు పాలకుర్తి సాంబరాజు చెవిని మూడు రోజుల క్రితం కోతులు కొరికాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో క్షతగాత్రున్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు. రెండ్రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన వృద్ధురాలు రావుల సారమ్మ చెంపను కొరికాయి. నెల రోజుల వ్యవధిలో మరో ఎనిమిది మంది కోతుల బారిన పడి గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. చేతిలో సంచి కనిపిస్తే చాలు లాక్కెళ్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈవిషయమై అధికారులకు సమాచారమిచ్చినా.. పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

ఆర్నెల్ల నుంచి ఎన్నికల పనిలో..



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- షెడ్యూల్ ప్రకటన.. నిఘా బృందాల ఏర్పాటు
- కలెక్టరేట్‌లో ఎన్నికల సెల్ ఏర్పాటు

హన్మకొండ అర్బన్: 'జిల్లాలో అధికార యంత్రాంగం ఆరు నెలల నుంచి ఎన్నికల పనిలో ఉంది. ఎన్నికలకు సంబంధించి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి' అని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో మొత్తం 4,94,179 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 483 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరితోపాటు ఎన్ఆర్ఐ ఓటర్లు 86 మంది, సర్వీస్ ఓటర్లు 221 మంది ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా నోడల్ అధికారులు 23 మంది, సెక్టార్ అధికారులు 57, ఇంటెలిజెన్స్ బృందంలో 12, ఎంసీసీ బృందాలు 12, ఎఎస్‌టీ బృందాలు 18 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సందర్భంగా ప్రత్యేక బృందాలు, మరికొన్ని ఎన్నికల నిబంధనలను కలెక్టర్ వెల్లడించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి..

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకుని నిర్వహణకు సిద్ధం కావాలని సూచించారు. ఇందులో వరంగల్ కలెక్టరేట్ నుంచి వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ నుంచి సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అధికారులు పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి: వరంగల్ కలెక్టర్

సాక్షి వరంగల్/కరీమాబాద్: వరంగల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లాలో మొత్తం 7,33,454 మంది ఓటర్లు ఉన్నారని, ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1950, 0870-2530811, వాట్సాప్ నంబర్ 9154252936 అందుబాటులో ఉంటుందన్నారు. తూర్పు నియోజకవర్గానికి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. సమావేశంలో ఎన్నికల అధికారులు రిజ్వాన్‌బాషా, అశ్వినితానాజీ, ఆర్డీఓ వాసుచంద్ర, డీపీఆర్ఓ అయుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలు.. నిబంధనలు
- హనుమకొండ జిల్లాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా 23 మంది అధికారులు, 57 మంది సెక్టార్ అధికారులను నియమించారు. 12 మంది అధికారులతో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇతర మోడల్ కోడ్ కమిటీలు, ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేశారు.
- 1950 నంబర్‌కు అందిన ఫిర్యాదులకు 100 గంటల్లో పరిష్కారం చూపనున్నారు.
- ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని 24 గంటల్లోగా తొలగించాలి.
- పబ్లిక్ ప్రాపర్టీపై 48 గంటల్లోగా తొలగించాలి.
- పీడబ్ల్యూడీ, యూత్, ఉమెన్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఏర్పాట్లు చేయనున్నారు.
- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు.
- జిల్లాలో 55 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.
- రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్తే లెక్క పక్కాగా చెప్పాలి. లేకపోతే ఆ నగదును ఐటీ శాఖకు అప్పగిస్తారు.

బీఆర్ఎస్‌లో ఉత్సాహం

- పరకాల ప్రగతి నివేదన సభ విజయవంతం
- ప్రతిపక్షాలపై కేటీఆర్ విమర్శలు.. అభివృద్ధి పథకాలపై సవివరణ



ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో చల్లా ధర్మారెడ్డి, బండా ప్రకాశ్ తదితరులు



కేటీఆర్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

పరకాల: పరకాలలో సోమవారం జరిగిన ప్రగతి నివేదన సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం కేటీఆర్ చేతులమీదుగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. కానీ.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో మంత్రి కేటీఆర్ పర్యటన ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతో ఆయన ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకే రూ.114.60 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మధ్యాహ్నం తరువాత స్థానిక పశువుల సంతలో జరిగిన నియోజకవర్గ ప్రగతి నివేదన సభకు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎందుకు గెలిపించాలి.. ప్రతిపక్షాలకు ఎందుకు ఓటియ్యకూడదో వివరించారు. దీంతోపాటు స్థానికంగా జరిగిన అభివృద్ధిని చెప్పుకొచ్చారు. మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని పరిచయం చేస్తూ.. బంపర్ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నిలదీయాలి.. బీజేపీ నాయకులను తరిమికొట్టాలి : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

10 ఏళ్ల కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం కనీవిని ఎరుగని రీతిలో దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచే అభివృద్ధి పనులు చేస్తుంటే.. రాష్ట్రంలో గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాల పేరిట ప్రజలను మోసం చేయాలని చూస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఐటీ ఎగొట్టిన వారి నుంచి.. స్విస్ బ్యాంక్ నుంచి నల్ల ధనాన్ని స్వాధీనం చేసుకొని పేదల ఖాతాల్లో వేస్తామని చెప్పిన నరేంద్ర మోదీ చివరకు దొంగపత్రాలు బ్యాంక్‌లలో పెట్టిన వారి రూ.15వేల లక్షల కోట్ల సొమ్మును మాఫీ చేశాడన్నారు. పేదలకు మోదీ ఇచ్చిన మాట ఎందుకు నిలుపుకోలేదో.. బీజేపీ నాయకులను నిలదీసి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పరకాల బంద్‌కు పిలుపునివ్వడం వారి అయ్య జాగీరా? అని ప్రశ్నించారు.

హనుమకొండలో పరకాల ఓట్లు 20వేలు : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

పరకాల నుంచి హనుమకొండలో నివాసం ఉంటున్న వారి సంఖ్య చాలా పెరిగిందని పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రస్తుతానికి హనుమకొండలో పరకాల ఓటర్ల సంఖ్య 20 వేలకు చేరిందన్నారు. అందుకే ఆ ఓట్లు తన గెలుపులో కీలకం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

'కోడ్'కూయకముందే ప్రారంభాలు

పరకాల మున్సిపాలిటీ పరిధిలో రూ.114.65 కోట్లతో అభివృద్ధి పనుల్ని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయా అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించాల్సి ఉండగా.. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రూ.4.80 కోట్ల నిధులతో నిర్మించిన కొత్త మున్సిపాలిటీ భవనం, రూ.38 కోట్ల నిధులతో పూర్తి చేసుకున్న మిషన్ భగీరథ అంతర్గత పనులు, రూ.2.80 కోట్లతో ఆర్డీఓ కార్యాలయ భవనం, రూ.2.15 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవనం, రూ.21.50 కోట్లతో పరకాల చలివాగు చెక్‌డ్యామ్ నిర్మాణానికి, రూ.20 లక్షలతో దోబీఘట్లకు, రూ.13 కోట్లతో పరకాల డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి, రూ.2.90 కోట్లతో పరకాల నుంచి దామెర వరకు డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ భవన నిర్మాణానికి అదనపు నిధులు తీసుకొచ్చినందుకు భవన ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి
వరంగల్ అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఈఆర్ఓ, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీపీ)పై అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటల్లోగా.. పబ్లిక్ స్థలాలు, పార్కులు సమావేశ స్థలాల్లో పార్టీల రాతలు, పెయింటింగ్స్ గోడలపై ఉంటే వెంటనే సున్నం వేయించాలన్నారు. 72 గంటల్లోగా పబ్లిక్ స్థలాల్లో, ప్రైవేట్ ప్రాపర్టీస్‌లో, అపార్ట్‌మెంట్లు, సూపర్ మార్కెట్లు షాపింగ్ మాళ్లు, ప్రైవేట్ పాఠశాలలపై రాజకీయ పార్టీలకు చెందిన సమాచారం తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే పెనాల్టీ విధించనున్నట్లు రిజ్వాన్ బాషా తెలిపారు.

పరకాల బంద్ ప్రశాంతం
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టులు

పరకాల: పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ.. కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ ఇచ్చిన పరకాల బంద్ సోమవారం ప్రశాంతగా జరిగింది. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. బంద్‌లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొనడం చూసైనా.. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని పాత రైల్వేగేటు సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతున్న వృద్ధుడు తూడి ఎల్లయ్య(73)ను డౌన్ లైన్‌లో వెళ్తున్న రైలు ఢీకొట్టగా మృతిచెందాడు. జీఆర్‌పీ హెచ్‌సీ ఆర్.రమణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివునిపల్లికి చెందిన ఎల్లయ్య వ్యక్తిగత పనులపై సోమవారం ఘన్‌పూర్‌కు వచ్చిన తిరిగి శివునిపల్లికి వెళ్లేందుకు పాత రైల్వేగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటుతున్నాడు. అతడికి చెవులు వినబడవని, దీంతో రైలు వచ్చిన విషయాన్ని గుర్తించక ఢీకొట్టగా మృతి చెందాడు. మృతుడికి భార్య పోచమ్మ, కూతురు ఉమ ఉన్నారు. కాగా జనగామ జీఆర్‌పీ హెచ్‌సీ రమణారెడ్డి, పీసీ సీహెచ్.నరేష్‌యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గేటు మూసినా ప్రమాదాలు..

ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాలకు కలుపుతూ ఉండే రైల్వేగేటును ఇటీవల రైల్వే అధికారులు పూర్తిగా మూసేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి సౌకర్యం ఉన్నప్పటికీ కొందరు గేటు మార్గం వద్ద అడ్డుగా ఉన్న సిమెంట్ బిళ్లలను తొలగించారు. అయినా గేటు మూసి ఉన్న కాలినడకన వెళ్లే వారు ఈ మార్గం నుంచే వెళ్తున్నారు. నెల రోజులలోపే ఇక్కడ మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు..


సోమ్లా నాయక్ (ఫైల్)

రాయపర్తి : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని బాల్ నాయక్‌తండా శివారు వసురాంతండాలో సోమవారం జరిగింది. ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వసురాంతండాకు చెందిన భూక్యా సోమ్లా నాయక్(55) ఆదివారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటార్‌ను సరిచేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.ఎంతకీ ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న రైతు..

నెల్లికుదురు: చికిత్స పొందుతున్న ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మదనతుర్తిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్వత యాకన్న (39) వరి పంటకు తెగులు సోకి పంటంతా దెబ్బతిన్నది. పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. దీంతో పొలం వద్ద ఈనెల 3న గడ్డి మందు తాగాడు. వెంటనే అతడిని ఖమ్మం ఆస్పత్రికి తరలిచగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సరిహద్దుల్లో పోలీస్‌బాస్

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో విస్తృత తనిఖీలు
- మద్యం, నగదు, డ్రగ్స్, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా
- రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సుడిగాలి పర్యటన


కాళేశ్వరం వద్ద బార్డర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీజీపీ అంజనీకుమార్

కాళేశ్వరం : తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కాళేశ్వరంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సోమవారం పర్యటించారు. భూపాలపల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆయన హాజరయ్యారు. అక్కడి నుంచి నేరుగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్‌పోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత కాళేశ్వరం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి, విలేకరులతో మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిందని, దీంతో తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ ప్రారంభించామన్నారు. కాళేశ్వరం బార్డర్‌లో తీసుకోవలసిన అంశాలపై ఇక్కడి పోలీసులతో చర్చించినట్లు తెలిపారు. అదే విధంగా ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు, డ్రగ్స్‌తో పాటు నిషేధిత వస్తువుల సరఫరా, ఉచిత వస్తువుల పంపిణీకి అడ్డుకుంటామని, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు పోలింగ్ రోజున ఓట్లు వేసేందుకు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం కాళేశ్వరం పరిధిలోని లక్ష్మి పంప్ హౌజ్, మేడిగడ్డ బ్యారేజీలను డీజీపీ సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

రెండు గంటలు ఇక్కడే..

మధ్యాహ్నం 12.25 గంటలకు కాళేశ్వరం చేరుకున్న డీజీపీ 2.15 గంటల వరకు ఉన్నారు. ముందుగా కాళేశ్వరాలయంలో పూజలు చేసిన అనంతరం స్థానిక హరిత హోటల్‌లో పోలీసులతో సమావేశం నిర్వహించారు. అక్కడే భోజనం చేసి, అంతరాష్ట్ర వంతెన, పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. డీజీపీ పర్యటన ఉండడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు, పోలీసులు ఉన్నారు.

కేయూలో విద్యార్థి జేఏసీ దీక్షల విరమణ


విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న వినయ్‌భాస్కర్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 34 రోజులుగా విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం తాత్కాలికంగా విరమించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలను తాము ప్రశ్నించి ఆందోళన చేస్తే టాస్క్‌ఫోర్స్ పోలీసులచే కొట్టించారని అందుకు బాధ్యులైన వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. కాగా విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఇటీవల హనుమకొండకు వచ్చిన మంత్రి కేటీఆర్ విద్యార్థులకు క్షమాపణ చెప్పడంతోపాటు పీహెచ్‌డీ అడ్మిషన్లపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అందుకు తాను బాధ్యత తీసుకుంటున్నాని తెలిపారు. విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు సీ.పీ రంగనాథ్‌తో మాట్లాడుతానని వెల్లడించారు. తొలుత దూరవిద్యాకేంద్రంలోని డైరెక్టర్ ఆఫీస్ గదిలో వినయ్‌భాస్కర్ విద్యార్థి జాక్ నాయకులతో, రిటైర్డ్ ఆచార్యులతో కొంత సేపు చర్చించారు.అనంతరం దీక్షలను విరమింపచేశారు. కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, నాయకులు మాచర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

19న రైల్వే సీసీఎస్ ఎన్నికలు

- కాజీపేట కేంద్రంగా 2,629 మంది ఓటర్లు
- 13 సీసీఎస్ డెలిగేట్ పదవులకు 36 మంది పోటీ

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ లిమిటెడ్ (ఈసీసీఎస్) ఎన్నికలు ఈ నెల 19వ తేదీన జరగనున్నాయని సోమవారం సీసీఎస్ డెలిగేట్స్ విలేకరులకు తెలిపారు. ఈ నెల 12వ తేదీన జరగాల్సిన సీసీఎస్ ఎన్నికలకు సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించగా 19వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు అధికారికంగా సీసీఎస్ ఎన్నికలు కాజీపేట ఓపెన్ లైన్‌లో జరుగనున్నాయని వివరించారు. కాజీపేట రైల్వే సీసీఎస్ 11వ నియోజకవర్గం పరిధిలో కాజీపేట–జనగామ, దర్గా యూనిట్ నంబర్–1, కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ నార్త్ యూనిట్ కేంద్రంగా మొత్తం 2,629 మంది సీసీఎస్ ఓటర్లుగా రైల్వే కార్మికులు ఉన్నారు. కాజీపేట కేంద్రంగా 13 మంది సీసీఎస్ డెలిగేట్స్ పదవులకు రైల్వే మజ్దూర్ యూనియన్ నుంచి 13 మంది, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నుంచి 13 మంది, ఇండిపెండెంట్స్ అభ్యర్థులు 10 మందితో కలిపి మొత్తం 36 మంది బరిలో ఉన్నారు.

అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

హసన్‌పర్తి : టీవీఎస్ ట్రెయినింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీతో ఎస్సార్ యూనివర్సిటీ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఇరువురు ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. పరిశ్రమలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల విద్యార్థులకు నూతన సాంకేతికను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ టీఎస్‌పీ టీఎస్ ప్రై.లి. మహ్మద్ సమీయొద్దీన్ మాట్లాడుతూ.. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ ఒప్పందం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు ఈ పరిశోధనల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇర్ఫాన్, సుధాకర్, వినోద్‌కుమార్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌పై వరుసకు బాబాయి అయిన ఓ కామాంధుడు ఐదు నెలల క్రితం అత్యాచారం చేయగా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా స్థానిక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు తెలిపిన వివరాలు.. ఓ గ్రామానికి చెందిన మైనర్ (15)పై అదేగ్రామానికి చెందిన వరుసకు బాబాయి అయిన యువకుడు (ఆటోడ్రైవర్) లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల బాధితురాలికి జ్వరం వస్తే తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి ఐదునెలల గర్భవతి అని చెప్పడంతో తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. కూతురును నిలదీయడంతో విషయం బయటకు వచ్చింది. ఈ మేరకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హడప్సర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి హడప్సర్ ట్రై వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం రైల్వే అధికారులు ప్రారంభించారు. కాగా ఈ ట్రై వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమ, గురు, శనివారాల్లో కాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుంది. జనగామ, భువనగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, బేగంపేట, లాథూర్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సజ్జన్‌లాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

20కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్, మరో ఇద్దరు పరారీ


గంజాయి, నిందితులను చూపుతున్న ఏసీపీ

కాజీపేట : రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ప్రయాణికులను నిలిపి తనిఖీ చేయగా వారి వద్ద 20కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేశామని మరో ఇద్దరు పరారైనట్లు ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ మేరకు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రానికి చెందిన టేటు పాలై (40), రేణు సామేల్ (45) అనే వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీలు చేయగా గంజాయి లభ్యమైందన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పోలీసుల రాకను చూసి పరారైనట్లు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు అల్లం రాంబాబు, పెండ్యాల దేవేందర్, సీఐ సార్ల రాజు, ఎస్సైలు లలిత, రవికుమార్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

గురుకుల విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలు సాధించిన వారితో ప్రిన్సిపాల్

న్యూశాయంపేట : తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) ఇంటర్ ఒకేషనల్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరిస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ములుగురోడ్డులోని హనుమకొండ(బి)1 గురుకుల కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని డీఎండబ్ల్యూఓ మేన శ్రీను, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీశ్ అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్లు బ్రహ్మనందరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ


రైలులో లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌లపై తిరుగుతూ తనిఖీలు చేశారు. అనుమానస్పదంగా కనిపించిన లగేజీ బ్యాగులను పరిశీలించారు. అదే సమయంలో వరంగల్ స్టేషన్‌కు వచ్చిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి తనిఖీలు చేస్తూ.. కాజీపేట స్టేషన్ వరకు వెళ్లారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో నగదు, బంగారం ఇతర వస్తువులు తీసుకొస్తే వాటికి తగిన ఆధారాలు వెంట తెచ్చుకోవాలని ప్రయాణికులకు సూచించారు. ఈతనిఖీల్లో ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మందలింపు..

- పాఠశాల భవనం నుంచి దూకిన విద్యార్థిని


పాఠశాల వద్ద ఆందోళనకు దిగిన కుటుంబీకులు

వరంగల్ : ఎల్‌బీ నగర్‌లోని దారుస్ ఉలూస్ ఫాతిమా నిస్వాన్ ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న బాలిక తోటి విద్యార్థులను దుర్భాషలాడడంతో తరగతి ఉపాధ్యాయురాలికి ఫిర్యాదు చేసింది. దీంతో ఉపాధ్యాయురాలు సదరు బాలికను మందలించి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక పాఠశాలలోని మొదటి అంతస్తు నుంచి దూకింది. నోటికి దెబ్బతగిలి దంతాలు ఊడిపోవడంతో పాఠశాల యాజమాన్యం వెంటనే చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే బాలిక తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగడంతో నిర్వాహకులు వారిని సముదాయించారు. సంబంధిత ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఘటన స్థలానికి పోలీసులు వచ్చినప్పటికి అప్పటికే సమస్య పరిష్కారం కావడంతో వారు వెళ్లి పోయారు.

దోపిడీ కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

- నేరస్తులు గుంటూరు, పల్నాడు జిల్లావాసులు

వరంగల్ లీగల్ : అద్దె ఇంట్లో ఉంటు ఆ ఇంటి యజమానులైన వృద్ధ దంపతులకు మత్తు పానీయాలు ఇచ్చి దోపిడీకి పాల్పడిన నేరంలో గుంజ పద్మ, గుంటూరు జిల్లా, బత్తుల బాబు, పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు నేరస్తులకు పదేళ్ల జైలు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు ఇచ్చారు. పీపీ షేక్ అబ్దుల్ నబి కథనం ప్రకారం.. వరంగల్‌లోని శివనగర్ బీసీ హాస్టల్ సమీపంలో దాసరి కొమురయ్య–కళావతి కిరాణ షాపు పెట్టుకొని నివసిస్తున్నారు. ఈ క్రమంలో గుంజ పద్మ, బాబు తాము నూతనంగా వివాహం చేసుకున్నామని మేస్త్రీ పని చేసుకునేందుకు నగరానికి వచ్చామని తెలిపి, అద్దె గది కావాలని నెల కిరాయి అడ్వాన్స్‌గా చెల్లించారు. అనంతరం 2015, ఫిబ్రవరి 12న తమ వివాహ రోజు అని నమ్మించి పాయసం చేసామని తాగమని వృద్ధ దంపతులకు, మరో గదిలో అద్దెకు ఉండే వారికి ఇచ్చారు. అది తాగిన కొమురయ్య–కళావతి మత్తులోకి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన నిందితులు వృద్ధ దంపతులు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బంగారాన్ని దోచుకొని పరారయ్యారు. పక్క రూంలో అద్దెకు ఉన్న వారు పాయసాన్ని తాగకుండా పక్కన పెట్టారు. మరుసటి రోజు తెల్లవారుజామున దంపతుల కిరాణంలో పాల కొనుగోలుకు వచ్చిన వారు వీరు ఎంతకు లేవకపోయే సరికి పక్కకు అద్దెకు ఉండే వారికి పిలిచి చెప్పారు. వాళ్లు వెంటనే స్పందించి స్పృహ కోల్పోయి మంచంలో పడి ఉన్న దంపతుల గురించి వారి పిల్లలకు తెలపగా వారు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీం ఆధారంగా కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు వృద్ధులకు పాయసంలో మత్తు మందు కలిపి ఉద్దేశపూర్వకంగా దోపిడికి పాల్పడ్డారని రుజువు కావడంతో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. కేసును అప్పటి మిల్స్ కాలనీ సీఐ, ప్రస్తుత నాగర్‌కర్నూల్ డీఎస్పీ సత్యనారాయణ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి, కానిస్టేబుళ్లు జ్ఞానేశ్వర్, ప్రతాప్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

పోలీసుల చేయూత

- క్రీడల్లో ప్రోత్సహిస్తూ.. ఉపాధికి మార్గం చూపిన ఖాకీలు
- క్రికెట్‌లో ఆల్‌రౌండర్.. పనిలో నంబర్ వన్‌గా సాయిప్రసాద్


పోలీసుల సహకారంతో ఏర్పాటు చేసిన లాండ్రీ షాపులో దుస్తులు ఇస్త్రీ చేస్తున్న సాయిప్రసాద్

హన్మకొండ : ఖాకీలంటే కాఠిన్యమే కాదు.. బతుకు బాటచూపే నిర్దేశకులు.. ప్రతిభకు పట్టం కట్టి బంగారు భవిష్యత్ బాటలు వేసే మార్గదర్శకులని నిరూపించారు. నా అంటూ ఎవరూ లేని ఓ నిరుపేద యువకుడికి తాము ఉన్నామంటూ అండగా నిలుస్తున్నారు. కులవృత్తిని నిర్వహిస్తూ.. సొంతంగా ఉపాధి పొందుతున్నాడు. అంతటితో ఆగకుండా తనకు ఇష్టమైన క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా తుక్కడ మండలంలోని రావిరాలకు చెందిన ఉప్పురూతుల సాయిప్రసాద్ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సాయిప్రసాద్ క్రికెట్ ఆట తీరును గమనించిన కొందరు పోలీసులు శభాష్ అని భుజం తట్టారు. వారు ఆడే ప్రతి టోర్నమెంటుకు సాయిని తీసుకెళ్లే వారు. ఆల్‌రౌండర్‌గా రాణించే సాయి ప్రతిభను గుర్తించిన పోలీసులు ప్రతి టోర్నమెంటుకు ప్రోత్సహించి సొంత ఖర్చులతో పంపించేవారు. సాయిప్రసాద్ తండ్రి చనిపోగా.. తల్లి స్వగ్రామంలో కులవృత్తి చేస్తుంది. కాగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు ఆటలో మెళకులవలు నేర్పిస్తూ, క్రీడా టోర్నమెంట్లను ఎప్పటికప్పుడు వివరిస్తూ సాయిని ప్రోత్సహిస్తూ వచ్చాడు. హనుమకొండలోని 9వ డివిజన్ గణేష్‌నగర్ అద్దె గదిలో ఉంటున్న సాయి ఓవైపు నర్సింగ్ కోర్సు చేస్తూనే బతకడానికి కులవృత్తిని ఎంచుకున్నాడు. పోలీసుల సహకారంతో కులవృత్తిలో భాగంగా దుస్తులు ఇస్త్రీ చేసుకుంటున్నాడు. ఐపీఎస్ వైభవ్ గైక్వాడ్, ఉదయ భాస్కర్, ఆర్ఐలు, సీఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు తనకు అండగా నిలబడ్డారని సాయిప్రసాద్ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

15 నుంచి రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రులు

- ఆలయ ఈఓ కె.వెంకటయ్య


కరపత్రం ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ తదితరులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల గుడిలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు ఈఓ, దేవాలయం ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ సోమవారం హనుమకొండలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ఉత్సవ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకటయ్య, గంగు ఉపేంద్రశర్మ, వినయ్‌భాస్కర్ మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ దాత పల్లం రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, గండ్రాతి రాజు, దేవాదాయశాఖ సిబ్బంది ప్రేమ్‌కుమార్, అర్చకులు సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ 'బుక్ అయ్యారా'

- నగ్న వీడియో వల.. వదిలించుకోండిలా!
- రిపోర్ట్ కొట్టండి.. సెట్టింగ్ మార్చండి



కాజీపేట : కాజీపేటకు చెందిన యువకుడు సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కరోనా అనంతరం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంట్లోనే ఉంటూ పని చేసుకుంటున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ మహిళతో న్యూడ్ కాల్ మాట్లాడి వారికి దొరికిపోయాడు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడ్తానని బెదిరించగా రూ.10లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో చివరికి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా ఎంతో మంది.. ఎన్నో రకాలుగా మోసపోతున్న ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి.

పరిమితుల్లేని శృంగారం.. అవధుల్లేని ఆనందం ఆస్వాదిద్దాం.. అంటూ వాట్సాప్ కాల్స్ ద్వారా నగ్నంగా మాట్లాడుతూ ఆపై వీడియోలు తీసి బెదిరిస్తున్న సైబర్ నేరస్తుల వల నుంచి తప్పించుకోవచ్చని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని యువకులు, వృత్తి నిపుణులే లక్ష్యంగా పశ్చిమ బంగా, రాజస్తాన్ ముఠాలు వలపు వలలు విసురుతున్నాయి. బుట్టలో పడిన వారిని బెదిరించి లక్షల్లో నగదు బదిలీ చేయించుకుంటున్నారు. పరువు పోతుందన్న భావనతో పలువురు.. నిందితులు అడిగినంత డబ్బు పంపిస్తూ మోసానికి గురవుతున్నారు. ఇకపై అలా చేయొద్దని, సొంతంగానే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు.

సాధ్యం కాదన్నా వినకుండా..

ఫేస్‌బుక్ ద్వారా యువకులు, వృత్తి నిపుణులను భరత్‌పూర్, కోల్‌కతాకు చెందిన యువతులు పరిచయం చేసుకుంటున్నారు. ఒకట్రెండు రోజులు ఫేస్‌బుక్‌లో మాట్లాడిన తర్వాత వాట్సాప్ నంబర్లు తీసుకుంటున్నారు. వాట్సాప్ కాల్ మొదలైన నిమిషానికే దుస్తులన్నీ విప్పేసి నగ్నంగా మారుతున్నారు. కొంతమంది యువతులు ప్రేమలోకి దింపి యువకుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఒక ఆటాడించి డబ్బులు దండుకుని వదిలేస్తున్నారు. మరికొంత మంది యువతులు ఒకటికి, రెండుసార్లు నగ్నంగా మారి వీడియో కాల్ చేయండని కోరుతున్నారు. ఇంట్లో ఉన్నాను.. బంధువులు, స్నేహితుల మధ్య ఉన్నాను. ఇప్పుడు చేయడం సాధ్యంకాదని చెప్పినా పదే పదే వీడియో కాల్ చేస్తుంటారు.

లొంగిపోతే ఇక బెదిరింపులే..

బాధితులు ఒత్తిడికి లొంగి వీడియో కాల్ చేయడం మొదలు పెట్టగానే మీ ముఖం కనిపించేలా మాట్లాడాలని తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తారు. వెంటనే అవతలి వైపు నుంచి మాట్లాడుతున్న యువతి మరో కెమెరాతో మాటలు, నగ్న దృశ్యాలను రికార్డు చేస్తుంది. కాల్ పూర్తైనా నిమిషాలకే వీడియోను పంపించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తామంటూ భయబ్రాంత్రులకు గురి చేస్తుంటారు.

కొత్తగా మార్చుకోండి..

అసభ్యకరమైన, అశ్లీల వీడియోలు పంపుతామని నేరస్తులు చెప్పిన వెంటనే మీ టైమ్‌లైన్‌లో.. 'నా ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది.. మీరు నాకు ఎలాంటి సమాచారం పంపొద్దం'టూ సందేశాన్ని పంపించండి. ఈ సందేశాన్ని హ్యాకర్ చూసినా మీకు ఎలాంటి ఇబ్బందులు రావు. స్మార్ట్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ తెరవగానే.. మూడు చుక్కలు కనిపిస్తాయి. వాటిపై నొక్కితే రిపోర్ట్ అని వస్తుంది. అందులో ఎవరో మీలా నటిస్తున్నారా? అన్నవి తెరపైకి వస్తాయి. మమ్మల్ని అనుకరిస్తున్నారా? అన్న ఐచ్ఛికాన్ని ఎంచుకుంటే.. ఫేస్‌బుక్ ప్రతినిధులు హ్యాకర్‌ను తొలగిస్తారు. అప్పుడు మీ ఫేస్‌బుక్ సెట్టింగ్‌లను కొత్తగా మార్చుకోవాలి.

సైబర్ ఉచ్చులో యువకుడు

- రూ.1,36,500 పోగొట్టుకున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

దామెర : సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కిన ఓ యువకుడు ఏకంగా రూ.1,36,500 పోగొట్టుకున్న ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మోటి శరత్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఏప్రిల్ నెలలో తన మొబైల్‌లో వాట్సప్ చూస్తున్న క్రమంలో పార్ట్‌టైమ్ జాబ్‌కు సంబంధించి వచ్చిన ఓ మెసేజ్‌ను అనుసరించాడు. తాను చెల్లించిన డబ్బులకు 30 శాతం అదనంగా వస్తాయని అవతలి నుంచి సైబర్ నేరగాడు నగదు ఆశ చూపించాడు. కాగా ఆ మెసేజ్‌లను నమ్మిన శరత్ మొదట రూ.5000లు తర్వాత రూ.33,500, రూ.40,000, రూ.8,000, రూ.50,000 మొత్తం రూ1,36,500లను సైబర్ నేరస్తుడు అడుగుతున్న విధంగా నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. కాగా తాను మోసపోయానని ఏప్రిల్ 30న గ్రహించి సైబర్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేశాడు. దీంతో శరత్‌కు వచ్చిన అకనాలెడ్జ్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల వ్యవధిలో రెండు నేరాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. డబ్బు ఆశచూపే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్సై ముత్యం రాజేందర్ సూచించారు.